


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# తారల అభిరుచులు

## ( 1957 సెప్టెంబర్ చిత్రసీమ నుంచీ పునర్ముద్రణ)

### భానుమతి



మన నటీమణుల్లో భానుమతి ఒక వినూత్న స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె నటనా కౌశల్యాన్ని గురించి అనేకమందికి అనేక అభిప్రాయాలుండవచ్చు. అయినా ఆమె ఉత్తమ నటిగానే పరిగణింపబడుతోంది. స్వతస్సిద్ధమైన ఆమె నైజాన్ని బట్టి ఆమెను పరి పరి విధాలుగా పరిగణిస్తారు. అనేకమంది ఆమె నైజం అంతేనని సరిపెట్టుకోగలిగేవారికి ఆమెతో ఏ బాధా ఉండదు. లేకపోతే నిర్మాతలకు ఆమెతో చికాకుగానే వుంటుంది. 'నన్ను ట్రబుల్‌సం ఆర్టిస్ట్ అని అనటం నాకు తెలుసు. అందుకు నేను గర్విస్తాను. ఎందుకంటే, ఉన్నది ఉన్నట్లుగా కుండ బ్రద్దలు కొట్టినట్లుగా మాట్లాడతాను. అంతేగాని తేనెపూసిన కత్తి మాదిరిగా ప్రవర్తించటం నాకు చేతకాదు, అంటుంది భానుమతి.

ఈ పరిశ్రమలో కష్టపడి సంపాదించిన ధనాన్ని యీ పరిశ్రమకే వినియోగిస్తోంది భానుమతి. భరణీ స్టూడియోను నిర్మించి అది ఎంతో వృద్ధికి వచ్చేట్లుగా కృషి చేసింది. దానికోసమే యింకా కృషి చేస్తోంది.

తెరమీద జీవితమంతా ఏదో అభూత కల్పనగా ఉంటుందని, కాని యింటికి వెళ్ళిన తర్వాత, తాను ఒకనికి భార్యనని, ఆయన సంతానానికి తల్లిననే విషయాన్ని ఆమె మరువలేనని అంటుంది.

తన దుస్తులను గురించి భానుమతి ఎక్కువగా పట్టించుకోదు. ఆమెకు ఏ రంగు చీరయినా ఒకటే, అసలు తనకున్న పనుల్లో, యీ చిన్న చిన్న విషయాలను గురించి ఆలోచించే వ్యవధి కూడా లేదని ఆమె అంటుంది.



# సావిత్రి

సావిత్రికి మామూలు సమయాల్లో 'మేకప్' చేసుకోటమంటే మహామంట. సింపుల్‌గా ఉంటేనే బాగుంటుందని ఆమె అభిప్రాయం. సావిత్రి అంటే నిర్మాతలకు చాలా సదభిప్రాయం ఉంది .సెట్ మీదకు వెళ్ళిందంటే, ఏ 'మూడ్'లోకి రావాలన్నా, డైరక్టర్ చెప్పిన మరుక్షణంలో ఆ 'మూడ్'లోకి ప్రవేశించగలదు. అంతేగాని యివ్వాళ 'మూడ్'లో లేనండీ అనే ఆర్టిస్ట్ కాదు సావిత్రి. 'వేంప్‌రోల్స్' అన్నా, వేంప్‌గా ఉండటమన్నా ఆమెకు సుతారమూ యిష్టంలేదు.

సౌందర్యార్చన కోసం టాయిలెట్స్ మొదలైనవి వాడటం యిష్టంలేదంటుంది సావిత్రి. 'మేకప్' దేనితో చేసుకుంటారు మీరు?' అని నన్ను చాలా మంది ప్రశ్నిస్తారు. 'దేనితోనూ చేసుకోను' అంటుందామె. చిరునగవుకు మించిన సౌందర్య భూషణం మరేదీ లేదని ఆమె అభిప్రాయం. తన అభిమానులు వ్రాసే ఉత్తరాలన్నీ సావిత్రి చదువుతుందిగాని, తీరిక చిక్కనందువల్ల అందరికీ సమాధానాలు వ్రాయటం కుదరటం లేదని ఆమె చింతిస్తుంది.

## *నాగేశ్వరరావు*



నాటకాల్లో ఆడవేషాలు వేసిన నాగేశ్వరరావు సినిమాల్లో మొగాడుగా మొనగాడయ్యాడు. 'ఇదివరకు నేను ఆడవేషాలు వేసిన నాటకాలు యిప్పుడు సినిమాలుగా తయారవుతున్నాయి. ఆ నాటకాల్లో ఆడవేషాలు వేసిన నేను, యీ సినిమాల్లో మొగవేషాలు వేస్తున్నాను' అంటారు నాగేశ్వరరావు. 'సెకండ్ ఫారం గ్రాడ్యుయేట్' అయిన నాగేశ్వరరావు 1941 సంవత్సరంలో చిత్రసీమలో అడుగుపెట్టి, అరవై చిత్రాలలో నటించారు. సినిమా జీవితం ఆయన జీవితానికి చాలా మెరుగులు పెట్టింది. ఎంతో వికాసాన్ని కూడా యిచ్చిందనే చెప్పాలి.

అదృష్టదేవతలనుకోకుండానే ఆయన్ని వరించిందని ఆయన అంగీకరించినా, తన అభిమానులు, నిర్మాతలు, తనపట్ల చూపిన ఆదరాభిమానాలను కూడా ఆయన విస్మరించలేరు.

### ఎన్.టి.రామారావు



ఇతర నటీనటుల మాదిరిగా కాకుండా రామారావుకు ఎప్పుడోగాని విశ్రాంతి దొరకదు. కొంచెం ఊపిరి సలుపుకుందామని కూడా ఆయన తలచడు. తన పనిలో అంత దీక్షగా ఉంటాడు. ఎంతసేపూ తన షూటింగ్ కార్యక్రమం, స్వంత కంపెనీ షూటింగ్‌లు, మొదలైన ఆలోచనలే కాని వేరే వ్యాపకమేమీ ఆయన పెట్టుకోరు. నటుడుగా తన జీవితాన్ని మెరుగులు పెట్టుకోవాలనే ఆసక్తి బాగా ఉంది.

రామారావు గ్రాడ్యుయేట్ అయినా మాతృభాషలోనే మాట్లాడతాడు. అదే ఆయనకు ఆనందం. అంతేకాని పరభాష మాట్లాడకూడదనే నియమమేమీ ఉన్న వ్యక్తికాదు. శ్రమకోర్చి పనిచేయటం, కాలాన్ని వృధా పుచ్చకుండా కార్యక్రమాన్ని కొన సాగించటం ఆయనలోని ప్రత్యేకత.

రామారావు తన పనిలో ఎంత దీక్షగా ఉంటాడో వినోదావారి 'చిరంజీవులు' షూటింగ్ చేస్తున్న రోజుల్లోని ఒక్క సంఘటన చెపితే సరిపోతుంది. ఆ చిత్రంలో ఆయన అంధుడు పాత్రను ధరించిన విషయం మీకు తెలిసినదే, తెరమీద గ్రుడ్డివాడుగా కనిపించటానికి ఆయనకు ప్లాస్టిక్ కళ్ళు తగిలించవలసి వచ్చింది. అలా చేసినందువల్ల 'వాస్తవికత' అయితే వచ్చింది కాని కళ్ళుపోయే పరిస్థితి ఏర్పడింది. చివరికి జనరల్ ఆసుపత్రికి వెళ్ళితేనేగాని ఆయన చూపు సరికాలేదు.

రామారావులో ఒక విచిత్రం ఉంది. షూటింగ్ సమయంలో ఏ కాస్త విరామం దొరికినా రెండు క్షణాలైనా సరే నిద్రను తెప్పించుకోగలడు. షాట్ అయిపోయి, మళ్ళీ షాట్‌కు లైట్ లు అరేంజ్ చేసుకుంటున్న సమయంలో ఆయన నిద్రపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి.

Post your comments